శ్రీరస్తు

విగ్రహారాధన తారావళి

మహాకవి దాసు శ్రీరాములు

(ఏప్రిల్ 8, 1846 – మే 16,1908)

Vigraharadhana Taravali
by
Mahakavi Dasu Sreeramulu

విగ్రహారాధన తారావళి

మహాకవి దాసు శ్రీరాములు
ప్రత్యేక సంకలనము 2024

డా. దాసు అచ్యుతరావు
© మహాకవి దాసు శ్రీరాములు స్మారకసమితి
ఫ్లాట్ నెం.201 శ్రీ సాయిరామ్ ఆదిత్యా రెసిడెన్సీ,
ఇంజనీర్స్ కాలనీ, ఎల్లారెడ్డిగూడ, హైదరాబాద్ - 500 073.
ఫోన్ : 040-23734864, 9490023947
email : araodasu@gmail.com

డి.టి.పి.
సమంత గ్రాఫిక్స్
హైదరాబాద్.
ఫోన్ : 9849551462



మహాకవి దాసు శ్రీరాములు

(ఏప్రిల్ 8, 1846 – మే 16,1908)

శ్రీరస్తు

విగ్రహారాధన తారావళి

ఈ పద్యములు గోదావరిజిల్లా ఫస్టుగ్రేడ్ ప్లీడరుగా నున్న

దాసు శ్రీరామ పండితునిచే

ఏలూరు విద్యానందినీ సమాజములో

సభవారికోరిక వలన 1894 ప్రాంతంలో జదువఁబడియె

బెజవాడలో నున్న వాణీముద్రాక్షర శాలయందు

ముద్రింపఁ బడియె.

1900

నివేదన

19వ శతాబ్దములో ప్రముఖ న్యాయవాది, సంఘసంస్కర్త, మహాకవిగా, మహావాగ్గేయకారుడిగా ఆంధ్రదేశంలో సంగీత, సాహిత్య, సాంస్కృతిక రంగాలను ప్రభావితం చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి దాసు శ్రీరాములు గారు (1846–1908). స్వయంకృషితోనే విద్యాభ్యాసం చేస్తూ సంస్కృతాంధ్ర భాషల్లో పండితులై, ప్రభంధాలు, పురాణాలు, శతకాలు, ధర్మశాస్త్రగ్రంధాలు,కృతులు,జావళీలు,పదములు,యక్షగానాలు మొదలైన వైవిధ్య ప్రక్రియలలో అనేక రచనలు చేశారు. గ్రామాలలో పాఠశాలలు నెలకొల్పి విద్యావ్యాప్తి చేసి ఉత్తమ ఉపాధ్యాయునిగా అందరి ఆదరాభిమానాలకు పాత్రులైనారు. ఆంగ్లం, పార్సీ భాషలలో ప్రావీణ్యం సంపాదించి ప్లీడర్ పరీక్షలలో ఉత్తీర్ణులై న్యాయవాదిగా గొప్ప పేరు ప్రతిష్టలు సంపాదించారు. సాంఘిక దురాచారాలను వ్యతిరేకిస్తూ సంస్కరణోద్యమాలలో చురుకుగా పాల్గొన్నారు. స్త్రీస్వాతంత్ర్యాన్ని,స్త్రీవిద్యనూ ప్రోత్సహించారు. బాల్యవివాహాలను నిరసించారు, సాహితీమూర్తులు, సంఘసంస్కర్తలు వీరేశలింగం,గురజాడ, శ్రీరాములు సమకాలీనులు. బ్రహ్మశ్రీ చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి గారు ఈమహనీయుని ప్రశంసిస్తూ ఇలా అన్నారు. “ఈయన సాక్షాత్తూ శ్రీనాధుని అవతారమే అంటే ప్రతిచెప్పే వారుండరని నా విశ్వాసం. శ్రీనాధునికంటే కూడ యీయన జీవితము మిక్కిలి ధన్యం. కవి గృహస్తులలోనిట్టి యదృష్టాలు పట్టినవారు మృగ్యులనికాని, అసలేలేరనికాని నిస్సంశయంగా చెప్పవచ్చు ... ఇక్కవి సహజపాండిత్య విషయముననే కాక భాగవతాంధ్రీకరణ ప్రసక్తియందుఁగూడ బోతరాజుగారే! ... యీయన సరసకవి,విద్వత్కవి, స్వతంత్రకవి, ఆశుకవి,దాత, నేత. ఇన్ని యోగాలు పట్టిన వారు యేకాలంలోనూ కవులలో మృగ్యులే.”

అంతటి మహనీయుని రచనలను పునర్ముద్రించి సాహితీ ప్రపంచానికి అందించాలనే ఉద్దేశ్యంతో ‘మహాకవి దాసు శ్రీరాములు స్మారక సమితి’ ని 1973 సంవత్సరములో స్థాపించి ఇంతవరకు ‘తెలుగునాడు’, ‘అభినవగద్యప్రధము’, ‘శ్రీ దేవీభాగవతము’, ‘సూర్యశతకము’, ‘కురంగగౌరీశంకర నాటిక’, ‘చక్కట్ల దండ’, ‘భృంగరాజ మహిమ, శ్రాద్ధ సంశయ విచ్ఛేది’, ‘దురాచార పిశాచ భంజని, ఆచారనిరుక్తి, విగ్రహారాధన తారావళి’ (1991), ‘కృతులు, పదములు, జావళీలు’,

'అభిజ్ఞాన శాకుంతలము', ప్రచురించాము. ఇవేకాక, మహాకవి దాసు శ్రీరాములు జయంతి సంచిక (1975), 'మహాకవి దాసు శ్రీరాములు గారి కృతులు–ఒక సమీక్ష' శ్రీమతి వెలగపూడి వైదేహి గారి పి.హెచ్ డి సిద్ధాంత వ్యాసము, మహాకవి గారి ఏకైక పుత్రిక శ్రీమతి వేమూరి శారదాంబ రచించిన 'మాధవశతకము' (2019) మరియు 'నాగ్నజితీపరిణయము '(2019) ప్రచురించాము.

'విగ్రహారాధన తారావళి'

అవి బ్రహ్మసమాజ ప్రభావంతో విగ్రహారాధనను నిరసిస్తూ, కించపరిస్తూ ప్రచారం జరుగుతున్న రోజులు. మహాకవి దాసు శ్రీరాములు (1846–1908) దానిని ఎదుర్కోవలసిన ఆవశ్యకతను గుర్తించి, సామాన్య ప్రజలలో అవగాహన పెంపొందించటానికి చేసిన రచన ఈ 'విగ్రహారాధన తారావళి'. 'ఉత్తమ ప్రాణికోటికి చిత్తశుద్ధి సాధనంబగు విగ్రహారాధనంబగు' అనే మకుటంతో విశ్వాంతరాళంలో మిల మిలా మెరుస్తూ ఉండే 27 నక్షత్రాలను సూచకంగా చేసుకుని విగ్రహారాధన ప్రాముఖ్యాన్ని ప్రతిపాదిస్తూ 27 సీస పద్యాలను 'విగ్రహారాధన తారావళి'లో పొందుపరిచారు. ఉపోద్ఘాతంగా 7 సంస్కృత శ్లోకాలు వ్రాశారు. 1894 ప్రాంతంలో ఏలూరు విద్యానందిని సమాజంలో సభవారి కోరికపై చదివారు, బెజవాడ 'వాణీముద్రాక్షర శాల'లో 1900 సం. లో ప్రప్రథమంగా ముద్రించబడింది.

మనసు చంచలమైనది. ప్రతిక్షణం అనేక ఆలోచనలతో ప్రాపంచిక విషయాలవైపు పరుగెడుతూ ఉంటుంది. అట్టి మనసును శుద్ధి పరిచి నిగ్రహించి, స్థిరత్వం, ఏకాగ్రత సాధించి, ఆత్మజ్ఞానాన్ని పొందటానికి మిక్కిలి ప్రయోజనకరమైన మార్గం విగ్రహారాధన. నిర్గుణ, నిరాకార బ్రహ్మను (దైవాన్ని) ధ్యానించ గలిగే స్థితిని చేరేవరకు సగుణ మూర్తిని ఉపాసించడం సముచిత విధానమే అనేది హైందవ సంస్కృతిలో భాగమే. అదేభావంతో దేవాలయాలలో వివిధరూపాలలో విగ్రహాలను ప్రతిష్టించి భక్తులు ఆరాధిస్తారు. సులభశైలిలో రచించిన 'విగ్రహారాధన తారావళి'లో అన్నిపద్యాలు జ్ఞానజ్యోతులుగా ప్రకాశిస్తూ విశ్వేశ్వరుడి సాన్నిధ్యానికి చేరుకునే మార్గంపై విశ్వాసాన్ని ధృఢతరం చేస్తాయి.

ఉదాహరణకి ఈ పద్యం చూడండి.

చిన్నతనంలో ఆడపిల్లలు బొమ్మరిల్లు కట్టుకొని ప్రపంచానికి ప్రతిరూపంగా ఊహించుకుని ఆడుకుంటారు. విక్టోరియా రాణి ఫొటోను ప్రాజానీకం ఆమె ప్రతిరూపంగా స్వీకరిస్తూ గౌరవిస్తున్నారు. వివిధ సంఘటనలను, సన్నివేశాలను సూచిస్తూ రకరకాల పటాలను, చిత్రాలను పత్రికలలో ముద్రిస్తుంటారు. నవాబులు, రాజ్యాధీశులు వారి వారి చిత్రపటాలను, శిల్పాలను గర్వంగా వేరువేరు ప్రదేశాలలో ప్రతిష్టించుకుంటారు. ఈ విశ్వానికి సృష్టికర్త అయిన భగవంతునికి ప్రతిరూపంగా ఒక ప్రతిమను మలచుకుని కొలుచుకుంటే ఫలితం ఉండదా అని ప్రశ్నిస్తున్న ఈపద్యాన్ని చూడండి.

సీ. అమ్మాయి బొమ్మరిండ్లలికి ముగ్గులు పెట్టి
బొమ్మలమర్చు నేబుద్ధితోడ
వివిధనాగరకోటి విక్టోరియారాణి
ఫొటో గ్రహించు నేబుద్ధితోడ
పత్రికాధీశ్వరుల్ బహువిధపటముల
పుటముల వైతురేబుద్ధితోడ
సాహేబెస్క్వైరు నక్షాలు స్టాట్యూలు డం
బుగనిల్పికొనుట యేబుద్ధితోడ

తే.గీ. భూమికర్తను దానొక్కబొమ్మచేసి
కొలుచువానికి నొక్కింత ఫలముకాదె
ఉత్తమప్రాణికోటికిc జిత్తశుద్ధి
సాధకంబ గు విగ్రహారాధనంబు

ఆకాలంలో వాడుకలో ఉన్న ఫొటో, నక్షాలు, స్టాట్యూలు మరియు గౌరవ సూచకంగా ఉపయోగించే సాహేబ్, యస్క్వైర్ అనే అన్యభాషా పదాలు ఛందస్సులో ఎంత పొందికగా ఉపయోగించారో గమనించాలి.

1991వ సంవత్సరములో 'దురాచార పిశాచ భంజని', 'ఆచారనిరుక్తి', 'విగ్రహారాధన తారావళి' అను ఈ చిన్ని గ్రంధములను మూడింటినీ పుష్పతా గుచ్ఛము వలె చేర్చి పునర్ముద్రించడమైనది. దీనికి కీ.శే. డా.శ్రీమతి వెలగపూడి

వైదేహి గారు విస్తృతమైన విశ్లేషణతో 'మున్నుడి' వ్రాసారు. ఆ 'మున్నుడి'లో 'విగ్రహారాధన తారావళి ' గురించి వ్రాసిన భాగము ఈ ప్రచురణలో చేర్చుడమైనది.

వర్తమాన కాలములో కూడా నాస్తిక భావజాలములు కలిగిన కొన్ని వర్గములవారు విగ్రహారాధనను అవహేళను చేస్తూ, కించపరుస్తూ ప్రచారం సాగిస్తూ హైందవుల మనోభావాలకు బాధకలిగిస్తున్నారు. కావున ప్రస్తుత కాలంలో, దాసు శ్రీరామకవి దాదాపు ఒక శతాబ్దము పూర్వము రచించి, హైందవ సమాజము ఈ దుష్ప్రచారములకు లోను కాకుండా 'విగ్రహారాధనము' సమస్త ప్రాణకోటికి చిత్తశుద్ధి సాధవంతమని తెలుపుచు, సహేతుకమైన తార్కిక దృష్టితో రచించిన ఈ పద్యకావ్యమును విడిగా కూర్చి సమాజానికి అందచేస్తున్నాము. మహాకవి శ్రీ దాసు శ్రీరాములు గారు రచించిన ఈ 'విగ్రహారాధన తారావళి' లఘు గ్రంధమయినా గుణమున గొప్పది అంటూ, వివిధ యుక్తుల విచారణ చేయడంవలన ప్రతిమార్చన, అనగా విగ్రహారాధన, చిత్తశుద్ధికి హేతువు అవుతుందని ఈ గ్రంథంలో ప్రతిపాదించిన విషయాన్ని విశ్లేషిస్తూ, విశదీకరిస్తూ డా. చిఱ్ఱావూరి శివరామకృష్ణ శర్మ గారు అత్యంత విలువైన పీఠిక "రాజిల్లే తారావళి" గా అందించారు. వారికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు.

డా. దాసు అచ్యుత రావు హైదరాబాద్
మహాకవి దాసు శ్రీరాములు స్మారక సమితి, 9-10-2024

రాజిల్లే తారావళి

మహాకవి, ప్రముఖ న్యాయవాది, మహావాగ్గేయకారుడు, అయిన శ్రీదాసు శ్రీరాములు బహుముఖ ప్రజ్ఞావంతులు. మహాకవి అయిన శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటకవి గారు వీరిని సరసకవి, విద్వత్కవి, స్వతంత్రకవి, ఆశుకవి, దాత, నేత, శ్రీనాథుడంతటి గొప్పవాడు, 'సహజపాండిత్య విషయమున పోతరాజు గారు' అని ప్రశంసించారు అంటే వీరి గొప్పతనం తెలుసుకోవచ్చు.

వీరి 'విగ్రహారాధన తారావళి' లఘు గ్రంథమయినా గుణమున గొప్పది. ఉపోద్ఘాత శ్లోకాలవలన వీరి సంస్కృత శ్లోక రచన కూడ రమణీయముగా ఉంటుందని తెలుస్తోంది. దానిలో "వివిధైర్యుక్తి విచారైః ప్రతిమార్చా చిత్తశుద్ధి హేతురితి", వివిధ యుక్తుల విచారణ చేయడంవలన ప్రతిమార్చన చిత్తశుద్ధికి హేతువు అవుతుందని ఈ గ్రంథంలో ప్రతిపాదించిన విషయాన్ని ఒక శ్లోకార్ధంలో వెల్లడించారు. "సకలేంద్రియ సంశుద్ధిః భక్తాః విగ్రహ పూజనాత్", విగ్రహారాధనవల్ల అన్ని ఇంద్రియాలకు శుద్ధి బాగాకలుగుతుంది. "మనోమల విశోధనం విహిత విగ్రహారాధనమ్". శాస్త్రం విధించిన విగ్రహారాధనము మనోమాలిన్యాన్ని తొలగించి శుద్ధి చేస్తుంది, అని వారు చెప్పిన వాక్యాలు విగ్రహారాధన చేసేవారికి స్థైర్యాన్ని కలిగిస్తాయి.

ఇది ఒక శాస్త్రవిషయాన్ని తెలిపే పద్య గ్రంథం. దీనిలో కవితా శక్తికి అవకాశం తక్కువ. అయినా కవి ప్రతిభచే కవిత గుబాళిస్తుంది. మొదటి పద్యంలో విగ్రహారాధన ప్రశంస ఉంది. ఇలాంటి సందర్భంలో పునరుక్తి వచ్చే ఇబ్బంది ఉంది. కవి శబ్దచమత్కారంచేత ఆదోషం కలుగ లేదు. విగ్రహారాధనము పరధనాపేక్షకు పాముకాటు, క్రోధ లోభాలకు గుండుదెబ్బ. ఇలా రూపకాలంకారాలచేత విగ్రహారాధనము అనేక దోషాలను తొలగిస్తుందని పునరుక్తిలేకుండా కవి చెప్పారు. భక్తిగా విగ్రహారాధనం చేస్తే ఏతప్పుచేద్దామని తోచినా కార్తవీర్యార్జునునిలా ఆ దేవతావిగ్రహం స్మృతికి వచ్చి ఆ తప్పుపని ఆగిపోతుందని కవి చెప్పారు. విశ్వాసం ఉంటే అంతేకదా మరి!

విగ్రహారాధన వలన అహంకారం తగ్గుతుందని 'భూనాయకులనైనఁ బువ్వులఁ

గోయించుc' అనే పద్యంలో చెప్పారు. దేవునికి అన్నీ స్వయంగా చేసుకోవాలనే భావం కలవారు స్వయంగాపల్లకి కూడా మోయడం కద్దు.

విగ్రహారాధన వలన సుగుణాలు కలుగుతాయని 'దర్పకార్తులనుc గాంతలనుండి యెడcబాపు' అనేపద్యంలో చెప్పారు.వీరి పద్యాలు చదివితే విగ్రహారాధన చేయనివారికి విగ్రహారాధన చేయాలనిపిస్తుంది.

విగ్రహారాధన అంటే భగవానునికి ప్రతీకగా విగ్రహాన్నినిలిపి పూజించడమే. విగ్రహారాధనను తీవ్రంగా వ్యతిరేకించే మతాల వారు పీరు, సిలువ, నిప్పు మొదలయిన వాటిని గౌరవించడాన్ని దృష్టాంతంగా చెప్పారు. దుష్టులను విగ్రహారాధన మంచివారుగా తీర్చిదిద్దుతుందని 'పరుల బీడించుటకు సిద్ధపడగనీక' మొదలైన వాక్యాలలో చెప్పారు.

విగ్రహారాధనలో సౌలభ్యం ఉందని చెప్పడమే కాక, చెప్పిన విషయాలను సహేతుకంగా సమర్థించడంలో కవిలోని న్యాయవాది మనకు సాక్షాత్కరిస్తారు. నిర్గుణారాధనలో కష్టాన్నితెలిపి, విగ్రహారాధన సద్యఃఫలాన్ని ప్రసాదిస్తుందని నచ్చేలా చెప్పారు.

ఈ లఘు గ్రంథంలో మరల మరల చదవాలనిపించేలా శైలి ఉంది. ఈ ఉత్తమ కృతిని చదివించినందుకు మహాకవి శ్రీ దాసు శ్రీరాములు గారి మునిమనుమలు, డా. దాసు అచ్యుత రావు గారికి ధన్యవాదాలు. మహాకవి శ్రీరాములు గారికి నమోవాకాలు.

డా. చిఱ్ఱావూరి శివరామకృష్ణ శర్మ
M.A.(San.), M.A.(Tel), Ph.D
రీడర్ (విశ్రాంతుడు)

అక్టోబరు 4, 2024
హైదరాబాద్

విగ్రహారాధన తారావళి

మున్నుడి

('దురాచార పిశాచ భంజని', 'ఆచారనిరుక్తి', 'విగ్రహారాధన తారావళి' మూడింటినీ పుష్ప గుచ్ఛము వలె చేర్చి 1991 లో పునర్ముద్రించబడిన పుస్తకములో కీ.శే. డా. శ్రీమతి వెలగపూడి వైదేహి గారు విస్తృతమైన విశ్లేషణతో వ్రాసిన 'మున్నుడి'లో 'విగ్రహారాధన తారావళి' గురించి వ్రాసిన భాగము.)

పుష్ప గుచ్ఛమందలి మూడవ పుష్పము "విగ్రహారాధన తారావళి" 'తారా' యనుటతోడనే 27 పద్యములుగల గ్రంథమని తెలియుచున్నది. బ్రహ్మసమాజ ప్రచారముచే ప్రభావితులైన కొందరు పెద్దలు, సామాన్యులను పెడదారి పట్టించుచుండ వారి ప్రబోధముల నరికట్టుటకై "విగ్రహారాధన తారావళి" రచించిరి. విగ్రహారాధనము బ్రహ్మసామాజికులకు నిషిద్ధము. కాని విగ్రహారాధనము సమస్త ప్రాణకోటికి చిత్తశుద్ధి సారవంతమని తెలుపుచు సహేతుకమైన తార్కిక దృష్టిలో - పద్యరచన గావించిరి. తారావళిలోని నాయికామణివంటిది ఈ క్రింది పద్యము.

సీ. అమ్మాయి బొమ్మరిండ్లలికి ముగ్గులుపెట్టి
బొమ్మలమర్చు నే బుద్ధితోడ
వివిధ నాగర కోటి విక్టోరియా రాణి
ఫొటో గ్రహించు నేబుద్ధితోడ
పత్రికాధీశ్వరుల్ బహువిధ పటముల
పుటముల వైతు రేబుద్దితోడ
సాహెబె స్మైరు నక్షాలు స్థాట్యూలు దం
బుగ నిల్పికొనుట యేబుద్దితోడ

గీ. భూమికర్తను దానొక్క బొమ్మచేసి
కొలుచువానికి నొక్కింత ఫలములేదు **॥ ఉత్తమ ॥ 13**

కవిగారి లోకవృత్త పరిజ్ఞానమునకు, ఉపమాన సంపత్తికిని ఇది నిదర్శనము.

దేవాలయములో భగవంతుని విగ్రహమును ప్రతిష్టించుట ఎందులకో దిగువ వివరించిరి.

సీ. కడుపులో దేవునిఁ గట్టుద మందమా ।
కడుపు మూత్రపురీష కలిత మయ్యో
గళమున దేవుని నిలుపుద మందమా!
గళము దుర్మాంస దుర్గంధయుతము

....

గీ. దివ్యతర గోపురాచ్ఛ మందిరములోన!
పావన శిలాదులం దేరు పరుపఁ దప్పే ॥ ఉత్తమ ॥ 16ప

ఎంతటి వేదాంత విషయమునైనను అరటిపండొలిచి చేతబెట్టినంత సులభముగ గ్రాహ్యమగునట్లు చక్కని ఉపమానముల గుదిగ్రుచ్చి విశదీకరించుట వెన్నతో పెట్టిన విద్య శ్రీరాములుగారికి.

సీ. అతిచంచలునిఁ గా రణచి పెట్టినయట్లు/
దొంగగొడ్డును దొడ్డిఁద్రోలినట్లు
కాచ పాత్రను దీపకళికఁ జేర్చినయట్లు /
పెట్టెలో రత్నంబు బెట్టినట్లు (ప. 18)

విగ్రహారాధనము విషయలోలత్వమునుండి మరలించి యింద్రియ నిగ్రహము కలిగించునని కవిభావన. మనుచరిత్రలో ప్రవరుని 'కుంభగత దీపకళికి' వలె విషయలోలుడుకాక ఇంద్రియ నిగ్రహము కలవాడని వర్ణించిరి. 'కుంభగత దీపకళిక' గాలికి చలించదు. అట్లే కాచపాత్రయందలి దీపకళిక కూడ చలించదు. కుంభము పారదర్శకము కాదు. కాచ పాత్ర పారదర్శకమే కాక అందలి కాంతి వెలుపల గూడ ప్రసరించి చుట్టూ నున్న వానిని కాంతివంతము చేసి దర్శింపచేయును. కనుక కాచ పాత్రయందలి దీపకళికవలె చలించని ఇంద్రియ నిగ్రహము కలవాడు మొదటివానికన్నమిన్న. ఈతని కాంతి ప్రక్కనున్న వారిపై కూడ ప్రసరించి వారిని సహితము మనోనిగ్రహము కలవారినిగ ప్రదీపించును. అంతేగాక పెట్టెలో పెట్టిన రత్నముపట్ల ఎంతో అప్రమత్తతతో నుండవలెను. కావున విగ్రహారాధనము విషయ లోలత్వమునకు లోను గాకుండ మనోనిగ్రహము పట్ల అప్రమత్తతగ నుండునట్లు చేయును.

ఇంతటి భావము మన మనోఫలకముపై నొక్కసారి తళుక్కుమనును. ఈ

తారావళి యందిట్టి తళుకులెన్నో కలవు. తారావళిహారమందు తాసిన సానదీర్చిన రత్నములవంటివి ఈ గ్రంథమందలి పద్యములు.

కవిగారి బహుముఖ ప్రజ్ఞను అపార పాండితీ శేముషీ విభవమును దర్శించుటకైననూ పరిగ్రహింపకతప్పదు. మహాకవి శ్రీ దాసు శ్రీరాములుగారి శాస్త్రీయ సౌధ్ధాంతర్భాగ పరిశీలనకు ఈమున్నుడి కరదీపిక యై యొప్పారును.

బాపట్ల **డా. వెలగపూడి వైదేహి**

'అత్రి భవన్' 8-8-1989

విగ్రహారాధన తారావళి

సంస్కృత శ్లోకములు

శ్లో ॥ శ్రీ సమాశ్లిష్టతనవే నిజాశ్లిష్టతను శ్రియే
తస్మై ప్రకృతి లీనాయ శ్రీకృష్ణ బ్రహ్మణేనమః ॥

శ్లో ॥ అధునా యధా మమ హృది స్ఫురతీ త థైవాస్మి నిగదితుం శక్తః
వివిథై ర్యుక్తి విచారైః ప్రతిమార్చా చిత్తశుద్ధి హేతు రితి ॥

శ్లో ॥ సంకల్పోమమ సత్యమ్ భవతద్దరి కరుణ యైవ భక్తస్య
నో చేదోం సత్యమితి వ్యా హర స్త్వనృతవాది ముఖజనితః ॥

శ్లో ॥ సుఖం ధర్మమూలం స శుద్ధాంగ మూల
శ్మరిరం హి శుద్ధ క్రియామూల మేవ
క్రియా శుద్ధ సంకల్ప మూలా సముద్య
న్మనో మూలక స్సోపి తత్త ద్భజస్వ ॥

శ్లో ॥ ఫలం చిత్త శుద్ధే ర్ద్విధా చైహి కాఖ్యం
తథా ముష్మికం లో కజం సౌఖ్య మాద్యం ।
ద్వితీయంతు నిర్వాణసౌఖ్యం దురూహం ।
తతో ధారయే త్యాధనం చారు తస్యాః ॥

శ్లో ॥ సకలేంద్రియ సంశుద్ధిః
భక్తాః విగ్రహ పూజనాత్
స్నానా ద్ధ్యానాచ్చ నియమాత్
సైవ చిత్తస్య శుద్ధతా ॥

శ్లో ॥ మనస శుద్ధతా యోగః
సర్వసంగ విసర్దనే ।
మనస శ్శుద్ధతా భోగః
సతాం సంసార సంగ్రహే ॥

శ్లో ॥ యోగో ముక్తి ప్రద స్సాక్షాత్
సాస్యా దాముష్మికం ఫలం
భోగో ముక్తిప్రద సాక్షాత్
సా భవే దైహికం ఫలం ॥

శ్లో ॥ జగద్గత మితి ప్రధాంనయతి వస్తు దై వం శుభం
జగచ్చలతి సర్వదా నిగదితం న దైవంతధా
మనోమల విశోధనం విహిత విగ్రహారాధనం ॥

విగ్రహారాధన తారావళి

సీసపద్యములు

సీ. అన్య దార సమీక్షణాశ కష్టమశని
 పరాధనాపేక్షకు పాముకాటు
అనృతవాద వినోదమునకు నైధనతార
 ధూర్తవర్తనలకు దుంపతెగులు
ద్యూతపాన మృగయాదులకు బ్రహాస్త్రంబు
 మౌర్ఖ్యంబునకు నవల్లమందు నూనె
క్రూరసాంగత్యంబు గుత్తుక యురిత్రాడు
 క్రోధలోభములకు గుండుదెబ్బ

గీ. ధర దివాస్వాపములకును దండుమారి
 శౌచలోప పిశాచాభిచార కర్మ
యుత్తమ ప్రాణికోటికిఁ జిత్తశుద్ధి
 సాధనంబగు విగ్రహారాధనంబు. 1

సీ. తగని గండాగొండి తసము కత్తులబోను
 కూట సాక్ష్యముల కంకుశపు పోటు
జంతు హింసల కర్ధచంద్ర ప్రయోగంబు
 చీఁకటి తప్పుల చెంపపెట్టు
ఆడి తప్పినదాని కగ్నిప్రవేశంబు
 పరపీడనకుఁ గశా ప్రహరణంబు
న్యాయ విద్వేషంబులకుఁ గాలపాశంబు
 విశ్వాస ఘాతకు వేఁటిపులుఁగు

గీ. విఙ్ఞవీకువ కెదిరింటి వెన్నుపోటు
ద్రవ్యలోభంబు తనయింటి స్తంభశూల ॥ ఉత్తమ ॥ 2

సీ. పలుకు ప్రల్లదము సంబాళించు వాకట్టు
అక్షిదోష నివారకాంజనంబు
ఒడలి కావరమార్చు నుర మర్దన క్రియ
చేతుల దుష్క్రియ ల్జెఱచు బొంద
కాళ్ళ దుర్గతులఁ జక్కంబెట్టు సంకెళ్ళు
నాస చేడ్పాటోర్చు నశ్యకర్మ
చెవుల పాపము గట్టు సేయు సిద్ధరసంబు
మెదడు మాంద్యము గొట్టు మేటి మందు

గీ. పాయు మేహన దుష్క్రియాపాటవంబుఁ
బట్టి బంధించు ధృఢ దారు పంజరంబు ॥ ఉత్తమ ॥ 3

సీ. భూనాయకులనైనఁ బువ్వులఁ గోయించుఁ
బుటికెలఁ బెట్టించుఁ బూజనొంచుఁ
గోటీశ్వరులనైనఁ గొలఁకుల మునిగించు
గుట్ట లెక్కించు మ్రొక్కులు గ్రహించుఁ
బండితోత్తమునైనఁ బాఠముల్జదివించుఁ
బాదము ల్బట్టించు భక్తిముంచు
వీర్యంతులనైన వీధులఁ ద్రిప్పించు
వెలుగుఁ బట్టించు సేవింపు గాంచు

గీ. శౌర్యవంతులనైనఁ బజ్జ నిలిపించు
సారెకును జెంప గొట్టించు స్వారి బూన్సు ॥ ఉత్తమ ॥ 4

సీ. దర్పకార్తులనుఁ గాంతలనుండి యెడఁబాపు
మోహ విభ్రాంతుల ముక్కుఁ బట్టుఁ
గ్రోధశీలురఁ జక్కఁ గూర్చుండగాఁ బెట్టు
పరమ లోభుల సొమ్ము బయిల వైచు
మద ఘూర్ణితుల వెన్ను మాటికి వంగించు

మాత్సర్య పటు నిజస్మరణ మెలపు
మందబుద్ధుల మంచి మంత్ర ముల్జదివించు
దంభ జృంభులకు హస్తములు మోడ్చు

గీ. నీచవంశులకును మహానియతిఁ గూర్చు
బధిర మూకాంధులకు సదభ్యాస మిచ్చు ॥ ఉత్తమ ॥ 5

సీ. ఉన్మాదమా లేక యుత్త ప్రమాదమా
ఖాను పీరునుఁ గిరస్తాను కొఱ్ఱు
అజ్ఞానమా లేక యాత్మాభిమానమా
సీకు నేజా పారసీకు నిప్పు
నవుటాలకా లేక ఠవురు గప్పాలకా
జోగిదండంబు బైరాగి సంచి
వేసానకా లేక కాసుకోసానకా
జైనుదేవళములా చైనువ్రాలు

గీ. మందమతులైన కొందఱు మంది క్రింద
మీదుఁ గానకఁ కూడునా వాదులాడ ॥ ఉత్తమ ॥ 6

సీ. ప్రొద్దెక్కు నందాక నిద్దుర లేవని
మొద్దుమానిసి వీపు పెద్ద గ్రుద్దు
నెల కొక్కపరియైన నీళ్ళమున్గని మొండి
బండి మానిసి ఔమ్ముఁ జెండుగుండు
క్రోలెమ్మునొచ్చినఁ గుదిరికూర్చుండని
కొంటె మానిసి కాలికుంటు గంటు
బడి పెట్టి చెప్పిన భగవంతుఁ దలఁచని
చెట్టమానిసి నెత్తిగొట్టు మొట్టు

గీ. హేయములఁ జేరనీయక నింద్రియములఁ
గట్టని గరాసు మానిసి గట్టు కట్టు ॥ ఉత్తమ ॥ 7

సీ. నీ వేరు నేనే రని చెడంబలుకు శుష్క
వేదాంతి పై తృవిచ్ఛేది మందు
కడు పేది కుడు పేది కనక మేదను శుద్ధ
లౌకికు వాత పలాశి మందు
వేదంబు వాదంబు నూదరాని పరమ
పాషండు శ్లేష్మవిభంజి మందు
దైవంబు దయ్యంబు లేవను గేవల
ప్రకృతి వాదిద్వంద్వ పాటి మందు

గీ. జాతి నీతులు లేని దుర్జాతి కుమత
ధర్మవిదు సన్నిపాత విధ్వంసి మందు ॥ ఉత్తమ ॥ 8

సీ. ఏది జేసిన కన్నులేవేళ నలవడు
దుష్టమూర్తుల జాడ దొరగనద్ది
ఏది చేసిన వీను లేవేళ నలవడు
దుష్టవార్తలు వినఁ దొరగనద్ది
ఏది చేసిన దేహ మేవేళ నలవడు
దుష్ట వస్తుల నంట దొరగనద్ది
ఏది చేసిన నాల్క యేవేళ నలవడు
దుష్ట రసము నాక దొరగనద్ది

గీ. ఏది చేసిన నాసిక యెపు డలవడు
దుష్ట గంధంబు మూచూడ దొరగనద్ది ॥ ఉత్తమ ॥ 9

సీ. కాళ్ళచే నడవదు కనులచేఁ జూడదు?
చెవులచే వినదు తాఁ జేతగొనదు
మేనిచే నంటదు కౌనుచేఁ వాలదు
గోళ్ళచేఁ దునుమదు పళ్ళనగదు
వేళ్ళచేఁ బట్టదు పిరుద గూర్చుండదు

నాస మూ చూడదు నాల్కఁ దినదు
వెన్నుచే నిలవదు వీపుచేఁ బండదు
పెదవిచేఁ బల్కదు మదిఁదలఁచదు

గీ. జ్ఞానరూపం బచలము సంగరహితంబు
నమల సన్మూర్తి దైవతం బనుచుఁ దెలుపు ॥ ఉత్తమ ॥ 10

సీ. కన్నులున్నవి కాని కననేర దంటివా
కనలేని వవి యెట్లు కన్నులయ్యె?
వీనులున్నవి కాని విననేర దంటివా
వినలేని వవి యెట్లు వీనులయ్యె?
కాళులున్నవి కాని కదలేదంటివా
కదల లేనివి యెట్లు కాళులయ్యె?
చేతులున్నవి కాని చేయలే దంటివా
చేయలేనివి యెట్లు చేతులయ్యె?

గీ. కనులు వీనులు కాల్సేతులనకఁ గాంచు ?
వినుఁ గదలుఁ జేయు భగవంతుఁ డని తెలుపు ॥ ఉత్తమ ॥ 11

సీ. పడకింటి శృంగార ఫల మబ్బుమల్లరం
గమునందు ఘోరవీరముదయించు
ధర్మశాలలయందు దయపుట్టు సింధుప
ర్వత గహ్వరముల నద్భుతము వొడము
బొమ్మలాటల హాస్యము జనించు రాత్రులఁ
జేల దాపున భీతిఁ జేరవచ్చు
పృధు పలాస్తుల గొఱ్ఱ భీభత్సము ఘటిల్లు
రణరంగములను రౌద్రంబు గెరలు

గీ. ఏది లేనిది భగవంతు నెఱుగజాల
మట్టి శాంతంబు గూర్చు దేవాలయములు ॥ ఉత్తమ ॥ 12

సీ. అమ్మాయి బొమ్మరిండ్లలికి ముగ్గులుపెట్టి

బొమ్మలమర్చు నే బుద్ధితోడ

వివిధ నాగర కోటి విక్టోరియా రాణి

ఫొటో గ్రహించు నేబుద్ధితోడ

పత్రికాధీశ్వరుల్ బహువిధ పటముల

పుటముల వైతు రేబుద్ధితోడ

సాహేబె సైరు నక్షాలు స్థాట్యూలు డం

బుగ నిల్పికొనుట యేబుద్ధితోడ

గీ. భూమికర్తను దానొక్క బొమ్మచేసి

కొలుచువానికి నొక్కింత ఫలములేదు ॥ ఉత్తమ ॥ 13

సీ. కనులతోఁ జూడ శక్యముగాని సత్తును

మదిలోఁ గనుట శాస్త్రమతముగాదు

వీనులతో విన వీలు పడని సద్దు

మదిలో వినుట శాస్త్రమతముగాదు

త్వక్కు చే స్పృశియింపఁ దరముగాని సువస్తు

మది స్పృశించుట శాస్త్రమతముగాదు

జిమ్మతోఁ దిన నసాధ్యమ్మైన ఫలమును

మదిఁ జవిఁగొన శాస్త్రమతముగాదు

గీ. ఘ్రాణమున మూ చూడగాగాఁ గానిపువ్వు

మదిని మూచూచుటది శాస్త్రమతముగాదు ॥ ఉత్తమ ॥ 14

సీ. సత్తు సత్తని బల్కు సత్తేది దెల్పుమా

యూరకే యూహించు నూహలోన

చిత్తు చిత్తని బల్కు చిత్తే దెల్పుమా

యూరకే యూహించు నూహలోన

అనంద మానంద మనుదానిఁ దెల్పుమా

యూరకే యూహించు నూహలోన
తత్తు తత్తని పల్కు తత్తేది దెల్పుమా
యూరకే యూహించు నూహలోన

గీ. త్వమ్ము త్వమ్మసి యసి యను త్వమసు లెవ్వి
యూరకే యూర కూహించు నూహలోన ॥ ఉత్తమ ॥ 15

సీ. కడుపులో దేవునిఁ గట్టుద మందమా
కడుపు మూత్ర పురీష క లితమయ్యె
గళమున దేవుని నిలుపుద మందమా
గళము దుర్మాంస దుర్గంధ యుతము
ముఖమున దేవుని మూయుద మందమా
ముఖము దుర్వాసనాంబుసహితంబు
తలలోన దేవుని వెలయింత మందుమా
తలఁ జెడుకంపు మేదస్సుగలదు

గీ. దివ్యతర గోపురచ్ఛ మందిరములోన
పావన శిలాదులం దేరుపరుపఁ దప్పె? ॥ ఉత్తమ ॥ 16

సీ. గాలికా ధూళికా కనులు మూయుచు మ్రొక్కు
మంటికా మింటికా మాటఁ జెప్పు
గోడకా సిడకా కోరికల్ వెదవెట్టు
బొందికా గొందికా పొగడికలిడు
గద్దెకా మిద్దెకా కల గోరములుదెల్పు
చట్టికా యుట్టికా జడిసి యొదగు
తట్టకా బుట్టకా దైన్యంబు ప్రకటించు
కూటికా ఊటికా గొణుఁగు మనవి

గీ. యెదుర నేదేని యొక్కటి యీశ్వరత్వ
మహిమ గల దున్నదని కాని మానవుండు ॥ ఉత్తమ ॥ 17

సీ.   అతిచంచలునిఁ గా రసణచి పెట్టినయట్లు
            దొంగగొడ్డును దొడ్డిఁ ద్రోలినట్లు
       దుష్టజంతువు బోను దూర్చిపట్టినయట్లు
            పెద్దదోమకుఁ బొగఁ బెట్టినట్లు
       వానయెండలను బవంతి గట్టినయట్లు
            ఉట్ల క్షీరఘటంబు లుంచినట్లు
       కాచపాత్రను దీపకళికఁ జేర్చినయట్లు
            పెట్టెలో రత్నంబు బెట్టినట్లు
గీ.   పరులఁ బీడించుటకు సిద్ధపడఁగ నీక?
       పరమదుష్ట ప్రపంచంబు పాలుగాక   ॥ ఉత్తమ ॥ 18

సీ.   దైవంబు సర్వగతంబు సర్వము కీఁడు
            దైవము మేలు సిద్ధాంతఫక్కి
       సర్వదైవంబుల సంబంధ ముడివోదు ?
            కీఁడు మేళ్ళవి సదాకూడియుండు
       తా సర్వమును బాయు దైవం బొకటి లేదు ?
            కీఁడు బాసిన మేలుఁ జూడరాదు
       దైవంబు కావలే దరియ సర్వము నన్న
            శీతాగ్నకై యాసఁ జేసినట్లె
గీ.   కాన సర్వంబు డాసి తద్గతముగొల్చి
       వండితుఁడు ముక్తుఁ డగునని పలుకుచుండు   ॥ ఉత్తమ ॥ 19

సీ.   సర్వం బనుటచేత సకల ప్రపంచ మ
            ర్ధంబగు నిందొక్క తప్పులేదు
       సర్వసేవన మేల సలుపరాదోయని
            తెలివిమాలిన వాఁడుపలుకవచ్చు
       సర్వాంగనల నేలసంగమించగఁరాదొ

తెలియఁజాలరు తమ బలముగాక
ఫలము చాంచల్యమే ప్రాపించుఁగాని ని
యతి నిశ్చలతలు ప్రాప్యములు గావు

గీ. కానఁ గొండొకవస్తువు కనులయెదట
నునిచి తద్గతదై వంబు కనుట కాదె. ॥ ఉత్తమ ॥ 20

సీ. అడ్డగాడిద నేల యర్చించ రాదన్న
కూసు లక్ష్మీ నేలఁ గూడరాదు
బంగారు తొడుగేల పద్మరాగము లేల
సింహాసనం బేల చెప్పుమన్న
సరిగంచుకోకేల మురి పెంపు రై కేల
పరుపేల దిళ్ళేల బలుకరాదొ
రక్తిఁ దెల్పుటకు భార్యకుఁ గూర్పవలె నన్న
భక్తిఁ దెల్పుటకు దైవమునకు నట్లు

గీ. దైవమును రాజు గురువు స్వీయావధూటి
నియతి విశ్వాసముల మైత్రు నిరతమహహ ॥ ఉత్తమ ॥ 21

సీ. ఎందున్న దేవున కెఱగెదరో నాకుఁ
దెలియ కున్నది మీరు దెలుపు డింక
ఎందును లేదది యందురో శూన్యంబు
సేవింప ఫలమేమి చెప్పుడింక
అన్నిటియందున్న దందురా యముతయు
గాయువు మీ కేది యరయు డింక
అందున్నదేదో యొండందురా నిశ్చయ
జ్ఞానంబు లేకుండ గాంచుడింక

గీ. కాన నికఁ నియత ద్రవ్యగత మ హేశుఁ
గొల్చుటే శ్రేయమని ఋషుల్ తలచిరయ్య ॥ ఉత్తమ ॥ 22

సీ. 'సారంబు దెల్సు నణోరణీయాన్ మహ
తో మహీయా' నని తొలి బలుకులు
తనయంద సర్వము తాను సర్వంబు నం
ద యునికి దీని యర్థమ్ము సుమ్ము
కరచరణాది మత్కాయంబు సర్వశ
బ్దార్థంబులోనిదే యనుము మనుము
తానన దైవంబు దైవంబు శుద్ధంబు
సర్వంబుఁ దలచుమీ చలము మలము

గీ. గరళమున రోగి రోగంబు గడపినట్లు
చలమలంబున గనుము నిశ్చలమమలము ॥ ఉత్తమ ॥ 23

సీ. ఎదుర నున్నది గోడ యేడ్చెద వేలరా
యేడరా నీదేవుఁ డేడనుండు?
ముందు నున్నది నింగి మూల్గెద వేలరా
యేడరా నీదేవుఁ డేడనుండు?
కొట్టుచున్నది గాలి గొణిగెద వేలరా
యేడడరా నీదేవుఁ డేడనుండు?
కంటిలోనిది నీరు కమమూతు వేలరా
యేడరా నీదేవుఁ డేడనుండు?

గీ. దేవుఁడా మాకు సొగసైన దేవళాన
దివ్యతరమూర్తి మేలి మేధీ వహవ్వ ॥ ఉత్తమ ॥ 24

సీ. ఆనంద మానంద మాయెరా మాదేవుఁ
డెలమి తేరెక్కి యూరేగువేళ
ఆనంద మానంద మాయెరా మాదేవుఁ
డంచితాన్నము లారగించువేళ
ఆనంద మానంద మాయెరా మాదేవుఁ

దమలాపగా తీర్థ మాడువేళ
ఆనంద మానంద మాయెరా మాదేవుఁ
దలరఁ జందనగంధ మలఁదువేళ

గీ. నేర మీదేవుఁ డొక్కనాడేని మీకు
నీడితానంద మిచ్చినట్లే రుప బడదు ॥ ఉత్తమ ॥ 25

సీ. 'అగ్నా క్రియావతా' మని చెప్పినందున
నిప్పునందే దేవుఁ డొప్పనుండు
'నేరవౌదేశో మనీషిణా' మనుటచే
బ్రొద్దులో దేవుండుఁ బొలుచుచుండు
'దెప్రతిమా స్వల్పబుద్ధి నా' మనుట చేత
ప్రతిమలో దేవుండు బలసియుండు
'గా యోగినాం హృదయే' యన్న మాటచే
హృదయంబునను దేవుఁ డిమిడియుండు

గీ. నిఁకను సంసారు లైనవారెల్ల నల్ప
బుద్ధు లనుటకు సందియంబు పడకుండు ॥ ఉత్తమ ॥ 26

సీ. హితబుద్ధిఁ జూడ గర్హితుఁడె సహితుండదగు
గురుబుద్ధిఁ జూడఁ బామరుఁడె గురుఁడు
పరబుద్ధి జూడఁ నపరము పరము
అధిక బుద్ధినిఁ జూడ నల్పమే యధికంబు
గుణబుద్ధినిఁ జూడ దుర్గుణమె గుణము
పుత్ర బుద్ధినిఁ జూడ శత్రుఁడే పుత్రుండు
విషబుద్ధిఁ జూడ నిర్విష మెవిషము

గీ. దైవబుద్ధినిఁ బూజింప దారువేని
దైవమే యగు బుద్ధి ప్రధాన మెందు ॥ ఉత్తమ ॥

– సమాప్తము –